సాక్షి

అన్నమయ్య జిల్లా

ఆదివారం । 18 । ఆగస్టు । 2024



అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశించారు. -8లో



తుది దశకు అండర్-19 టోర్నీ

కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ చివరి దశకు చేరుకుంది. శనివారం మ్యాచ్‌లో కడప, విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.270	రూ.320
రెండోరకం	రూ.200	రూ.266

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 394 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

సీఐల నియామకం

రాయచోటి: అన్నమయ్య జిల్లా పరిధిలో సీఐల నియామకం మూడో పర్యాయం జరిగింది. కర్నూల్ రేంజ్ డిఐజీ కోయ ప్రవీణ్ రేంజ్ పరిధిలో 39 మంది సీఐలను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లా పరిధిలో ఎస్ మహబూబ్ బాషా వీఆర్‌కు, రవిశంకర్ రెడ్డి దిశా-1, ఎన్ మోహన్ కుమార్ డీసీఆర్‌బీకి, ఎం చంద్రశేఖర్ సీసీఎస్‌కు, కె మద్దయ్య ఆచారి ఎస్‌బీ-11కు, వి చలపతి ఎస్‌బి-111కు, ఎన్ రవీంద్రనాథ్, ఎస్సీ, ఎస్టీ సెల్‌కు, బి రాఘవరెడ్డి, ఆర్‌ఎస్‌టీఎఫ్‌కు, టి నరసింహులు ఆర్‌ఎస్ఏఎస్‌టీఎఫ్‌కు నియమించారు. అలాగే అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న సీఐ శేషయ్యను కర్నూలు వన్‌టౌన్‌కు, జి శంకర మల్లయ్యను కర్నూలు విమానాశ్రయానికి, యువరాజును నంద్యాల ఎస్సీ, ఎస్టీ సెల్‌కు బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మెజిస్టిక్ టు హార్సిలీహిల్స్



హార్సిలీహిల్స్ చేరుకున్న సైక్లిస్టులు

బి.కొత్తకోట: మెజిస్టిక్ టు హార్సిలీహిల్స్ సైకిళ్లపై ఫిట్‌నెస్ పందెం శనివారం ఆసక్తికరంగా సాగింది. కర్ణాటక రాజధాని బెంగళూరు నుంచి అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ వరకు, మళ్లీ ఇక్కడినుంచి బెంగళూరు వరకు ఇలాంటి సైక్లింగ్ పందాలు గతంలో చాలా జరిగేవి. ఏడేళ్లుగా ఇవి కనుమరుగవగా మళ్లీ ప్రారంభమయ్యాయి. బెంగళూరుకు చెందిన రాండమానస్ అనే స్వచ్ఛంద సంస్థ ఫిట్‌నెస్‌పై పందెం నిర్వహించింది. రాను, పోను 300 కిలోమీటర్ల దూరం కలిగిన బెంగళూరులోని మెజిస్టిక్ నుంచి హార్సిలీహిల్స్ వెళ్లి తిరిగి ఇక్కడికి ఎవరు ముందుగా చేరుకుంటారో వారే ఇందులో విజేత. మెజిస్టిక్‌లో ఉదయం ఆరు గంటలకు ప్రారంభమైన ఈ పోటీల్లో 80 మంది పాల్గొనగా అందులో ఇద్దరు యువతులు. వీరంతా తమ సైకిళ్లపై మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్యలో హార్సిలీహిల్స్ చేరుకున్నారు. మెజిస్టిక్ నుంచి హోసకోట, హెచ్‌క్రాస్, చింతామణీ, తాడిగోళ్లక్రాస్, గౌనిపల్లె, బి.కొత్తకోట మీదుగా కాండ్లమడుగు చేరుకుని అక్కడినుంచి 9 కిలోమీటర్ల ఘాట్‌రోడ్డుపై సైకిళ్లు తొక్కుకుంటూ కొండపైకి చేరుకున్నారు.

ముగిసిన కౌన్సెలింగ్

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో నిర్వహించిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సు నియామకాల ప్రక్రియ ముగిసింది. మొత్తం 206 పోస్టులకుగాను రోజుకు 50 మంది చొప్పున కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ మేరకు శనివారం చివరి విడతగా 52 మందికి కౌన్సెలింగ్ నిర్వహించగా, 43 మంది హాజరై నియామక పత్రాలను స్వీకరించారు. అనంతరం ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ వై.శ్రీనివాసులు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం స్టాఫ్ నర్సు నియామకాలను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్త వత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు అతావుల్లా, బత్తనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమవిద్యాభివృద్ధికి కృషి చేయాలి




మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

కలకడ: జిల్లాలోని ప్రతి గురుకుల పాఠశాల, ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కలకడ కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాలలో ఉన్న కనీస సౌకర్యాలు, అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని డీఈఓ పరిశీలించారు.మెనూ ప్రకారం భోజనం అందేలా చూడాలన్నారు. పాఠశాలకు మంజూరైన నాడు-నేడు నిధులు విడుదల చేసి పనులు పూర్తయ్యేలా చూడాలని ప్రిన్సిపాల్ అనిత డీఈఓను కోరగా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని ఆయన చెప్పారు. గత ప్రభుత్వం విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లు ప్రతి పాఠశాలలో వందశాతం ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. సిబ్బందిపై ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయునిలు, పాల్గొన్నారు.

గుట్టకాయ స్వాహా!

'పచ్చ'రాజ్యంలో ప్రకృతి వనరులు ధ్వంసమవుతున్నాయి. టీడీపీ నేతల కోరల్లో చిక్కి గుట్టలు గుల్లవుతున్నాయి. చెట్టూ..చేమా..కొండా కోనా నిలువునా కరిగిపోతున్నాయి. కడపలో గ్రావెల్ మాఫియా రాజ్యమేలుతోంది. ఆకాశమే హద్దుగా అక్రమ రవాణాతో చెలరేగుతోంది. నిత్యం గ్రావెల్‌ను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతోంది.



కొలుములపల్లె పిచ్చమ్మ గుట్టపై గ్రావెల్ లోడింగ్ చేస్తున్న దృశ్యం

- వైఎస్‌ఆర్ జిల్లా చింతకొమ్మదిన్నె మండలంలో గుట్టలు గుల్ల
- టిప్పర్ల ద్వారా నిరంతరం తరలింపు
- 5 లీజుల పరిధిలో డిమాండ్ ఉన్న గ్రావెల్ అంతా కొలుములపల్లె నుంచే...
- టీడీపీ నేతల కనుసన్నల్లోనే అక్రమ మైనింగ్
- ఫిర్యాదులున్నా కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, కడప: అక్రమ మైనింగ్‌దారులు చెలరేగిపోతున్నారు. వైఎస్‌ఆర్ జిల్లా చింతకొమ్మదిన్నె మండలం నుంచి అక్రమంగా కడపకు గ్రావెల్ తరలిస్తున్నారు. నిత్యం వందలాది టిప్పర్లతో గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఏకంగా మూడు మిషన్లుతో గ్రావెల్ లోడింగ్ చేస్తున్నారు. ఫలితంగా లక్షలాది రూపాయలు రాయల్టీ రూపేనా లభించాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. ఇదంతా బహిర్గతంగా జరుగుతున్నా అధికార యంత్రాంగం తేలుకుట్టిన దొంగలా చూస్తోంది.

- కడప చుట్టుపక్కల ప్రాంతాల్లో అధికారికంగా 5గ్రావెల్ మైనింగ్ లీజులున్నాయి. వాటి పరిధిలో ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి గ్రావెల్ తరలించేవారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అధికారిక మైనింగ్ లీజుదారులకు రాయల్టీ అనుమతులు ఇవ్వలేదు. ఇదే ఆసరాగా తీసుకుని తెలుగుదేశం నాయకులు అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. తద్వారా కోట్లాది రూపాయాలు ఆర్జిస్తున్నారు. ఈక్రమంలో చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె గ్రామం సమీపంలోని పిచ్చమ్మ గుట్టను గుల్ల చేస్తున్నారు. 3 మిషన్లు పెట్టి టిప్పర్లకు లోడింగ్ చేస్తున్నారు. వందలాది ట్రిప్పులు యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్నా, అధికారులు అటువైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేకున్నారు.

నెలరోజులుగా రవాణా

చింతకొమ్మదిన్నె చెరువులో తొలుత గ్రావెల్ మట్టి అక్రమంగా తరలించే చర్యలకు పాల్పడ్డ పచ్చ నేతలు, తర్వాత కొలుములపల్లె పిచ్చమ్మ గుట్ట కేంద్రంగా అక్రమంగా మైనింగ్ కొనసాగిస్తున్నారు. తొలి రోజుల్లో నిత్యం రెండు వందల ట్రిప్పులు గ్రావెల్ కడప చుట్టుపక్కల ప్రాంతాలకు తరలివెళ్లేది. టిప్పర్ రూ.4500తో కడపకు యథేచ్ఛగా తరలించారు. టిప్పర్ బాడుగ, మిషన్ లోడింగ్ రూ.2వేలు ఖర్చు మినహాయిస్తే టిప్పర్‌కు రూ.2500 ఆదాయాన్ని తెలుగుతమ్ముళ్లు ఆర్జిస్తున్నారు. అంటే రోజుకు రూ.5లక్షలు చొప్పున అక్రమ ఆదాయాన్ని గడిస్తున్నారు. ఇంత యథేచ్ఛగా అక్రమ మైనింగ్ చేస్తున్నా జిల్లా కేంద్రంలో అధికార యంత్రాంగం మొత్తం తిష్టవేసి ఉన్నా, అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ స్థాయి వరకూ ఎవ్వరూ కూడా కన్నెత్తి చూడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



లోడింగ్ అనంతరం గ్రావెల్‌తో కడపకు వస్తున్న టిప్పర్

కోల్డ్‌వార్‌తో నెమ్మదించిన దూకుడు

టీడీపీ నేతల మధ్య నెలకొన్న కోల్డ్‌వార్ కారణంగా అక్రమ మైనింగ్ దూకుడుకు ఇటీవల కాస్త బ్రేకులు పడ్డాయి. నిత్యం రూ.5లక్షలు కడప కేంద్రంగా గ్రావెల్ మైనింగ్ ద్వారా సంపాదిస్తున్నారనే విషయం తెలుసుకున్న అధికార పార్టీలో మరోవర్గం అక్రమ ఆదాయానికి గండికొట్టే ఎత్తుగడను ఎంచుకున్నారు. కడప కార్పొరేషన్ పరిధిలో వెంచర్లల్లో ఎక్కడా కూడా రోడ్డు ఫార్మెషన్ పనులు చేయరాదని రియల్టర్లను కార్పొరేషన్ అధికారులు అనధికారికంగా హెచ్చరికలు జారీ చేశారు. ఆపై వార్డు సచివాలయ సిబ్బంది స్వయంగా పర్యవేక్షణ చేస్తున్నారు. దాంతో 200 ట్రిప్పుల స్థానంలో ప్రస్తుతం సగానికి మాత్రమే పరిమితం అయినట్లు సమాచారం .కట్టడి చేయాల్సిన మైనింగ్ అధికారులు అధికార మత్తులో జోగుతుంటే, తెలుగుతమ్ముళ్ల మధ్య నడుస్తున్న కోల్డ్‌వార్ కారణంగా మరో విధంగా కార్పొరేషన్ యంత్రాంగం ద్వారా కట్టడి చేసే ప్రయత్నాలు తెరపైకి వచ్చాయి. అంతే తప్పా అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి డీడీ రవిప్రసాద్‌ను వివరణ కోరగా అక్రమ మైనింగ్ వ్యవహారం తన దృష్టికి రాలేదని తెలిపారు. ఫుల్ అడిషనల్ ఛార్జీలో ఉన్నానని, మైనింగ్ యంత్రాంగాన్ని పంపించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గ్రావెల్ లోడింగ్ కోసం వెళ్తున్న టిప్పర్లు

గండిక్షేత్రం.. భక్తజనసంద్రం

చక్రాయపేట: శ్రావణమాసం రెండో శనివారోత్సవం సందర్భంగా గండి క్షేత్రం భక్తజనంతో నిండిపోయింది. ఆలయ ప్రధాన,ఉప ప్రధాన,ముఖ్య అర్చకులు కేసరి,రాజారమేష్, రాజగోపాలాచార్యులు అర్చకులు రఘు,సాయిలు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.పూజలు నిర్వహించారు.పలువురుభక్తులు అన్నదానం నిర్వహించి తమ మొక్కు చెల్లించుకున్నారు. కడప సర్వజన ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చక్రాయపేట ప్రభుత్వ వైద్యశాల తరపున డాక్టర్ స్వర్ణలత వైద్యశిబిరం నిర్వహించి అస్వస్థతకు గురైన వారికి చికిత్స అందించారు. ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ వెంకటస్వామి పాలకమండలి సభ్యులు ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. రెండో శనివారం సుమారు 40 వేల మంది వరకు భక్తులు స్వామిని దర్శించుకుని ఉంటారని ఆలయ వర్గాల అంచనా. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయుడు



అంజన్న దర్శనం కోసం క్యూ లైన్లలో భక్తుల ఎదురు చూపు

ఇన్‌స్పైర్ మనాక్‌కు కార్యాచరణ

మదనపల్లె సిటీ: విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా రూపొందించేందుకు ఇన్‌స్పైర్ మనాక్‌కు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. 2024-25లో నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి ఎక్కువ మంది ఎంపిక య్యేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇటీవల ఉపాధ్యాయులకు డివిజన్ స్థాయిలో మదనపల్లె, రాయచోటి, రాజంపేట,పీలేరులలో సమావేశాలు నిర్వహించి, విధి విధానాలు వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి, ఇంటర్‌నెట్‌లో ఎలా దరఖాస్తు చేయాలో చూపించారు. జాతీయ స్థాయిలో ఎంపికైన ఉపాధ్యాయులతో సూచనలు,సలహాలు ఇప్పించారు. ఇందులో పాల్గొనేందుకు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు దరఖాస్తు చేసేందుకు అర్హులు. గత ఏడాది 2,700 మాదిరిగానే ఈ సారి దీని కంటే ఎక్కువగా దరఖాస్తులు సమర్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. సెప్టెంబర్ 15వ తేదీ వరకు ఇన్‌స్పైర్ మనక్‌కు దరఖాస్తు చేయాలి. ముందస్తుగా ఏఏ ప్రాజెక్టులు తయారు చేసుకోవాలో నిర్ణయించుకోవాలి. వాటికి సంబందించిన చార్టులు రూపొందించి ఇంటర్‌నెట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎక్కువ మంది ఎంపిక కావాలన్నదే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.



శిక్షణా తరగతులకు హాజరైన గైడ్ టీచర్లు

ప్రతి పాఠశాలలో ఐడియా బాక్సు: ప్రతి పాఠశాలలో ఐడియా బాక్సు ఏర్పాటు చేసుకోవాలి. ఉదయం పాఠశాల అసెంబ్లీ,సాయంత్రం 30 నిమిషాలు విద్యార్థులతో చర్చించాలి. ఇలా చర్చించాక ఉత్తమమైన నమూనా తయారు చేయించాలి. ఎంపికైతే ప్రయోగం చేసేందుకు విద్యార్థికి రూ.10 వేలు అందిస్తారు.

2700 పాఠశాలల నుంచి వచ్చిన ప్రాజెక్టులు:

328 జిల్లాకు ఎంపికైనవి:

21 రాష్ట్ర స్థాయికి ఎంపికైనవి

2 జాతీయ స్థాయికి ఎంపికైనవి:



ఎక్కువ దరఖాస్తులు చేసేలా...



ఎక్కువ దరఖాస్తులు సమర్పించేలా ఈ విషయమై ఉపాధ్యాయులకు అవగాహన కలిగించాలి. ఎటువంటి సందేహాలున్నా నేరుగా సంప్రదించవచ్చు. ఎక్కువ మంది ఎంపిక కావడమే లక్ష్యం.

–మార్ల ఓబుల్‌రెడ్డి, జిల్లా సైన్సు అధికారి

వైద్యుల కన్నెర్ర



సుండుపల్లెలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు,తదితరులు



వైద్యో నారాయణ హరి.... వైద్యులు దేవుళ్లతో సమానమని, తల్లిదండ్రులు జన్మనిస్తే వారు పునర్జన్మనిస్తారు. ప్రపంచాన్ని వణికించిన కరోనా విపత్తులోనూ ప్రాణాలను పణంగా పెట్టి వైద్యులు అందించిన సేవలు వెలకట్టలేనివి. అలాంటి వైద్యుల భద్రతకే ఉపద్రవం ఏర్పడింది. కోల్‌కతాలోని ఓ మెడికల్ కాలేజీలో పీజీ విద్యను అభ్యసిస్తున్న యువ వైద్యురాలు అత్యాచారం, హత్యకు గురైంది. అత్యంత పాశవికమైన ఘటన యావత్ దేశాన్ని ఒక్కసారిగా కుదిపేసింది. ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులకు పటిష్టమైన భద్రతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలని, కోల్‌కతాలో జరిగిన అమానవీయ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుని, దోషులను కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా వైద్యులు నిరసన ప్రదర్శనలు, మానవహారం, క్యాండిల్‌మార్చ్‌లు నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్



కడప రిమ్స్ ఆవరణంలో జరుగుతున్న ఆందోళనలో పాల్గొన్న వైద్య విద్యార్థులు



మదనపల్లెలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిరసన

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

నందలూరు: రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలకోసం ప్రత్యేక మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. ఫ్రీ హోల్డ్ భూముల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మోహన్, ఆర్ఐ సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో నివేదికలు పరిశీలించాలి

ఓబులవారిపల్లె: ప్రభుత్వ నిబంధనల ప్రకారం డీకేటీ భూములు రిజిస్టర్ చేయించేందుకు రీసర్వే క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సిద్ధం చేయాలని సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన రికార్డులను ఆమె పరిశీలించారు. ఆర్ఐ రామ్మోహన్ నాయుడు, సర్వే డీటీ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి

ప్రయోగశాలలను సమర్థవంతంగా నిర్వహించండి

రాయచోటి (జగదాంబసెంటర్): అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలోని ప్రయోగశాలలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి సైన్స్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం రాయచోటి పట్టణం నేతాజీ సర్కిల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం సైన్స్ ఉపాధ్యాయుడి బాధ్యత అని, అందుకు ప్రయోగశాల సరైన వేదిక అని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 27 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, 17 స్టెమ్ ల్యాబ్‌లు, 20 పాల్ ల్యాబ్‌లు, 5 ఆస్ట్రానమీ ల్యాబ్‌లు, 250 సైన్స్ ల్యాబ్‌లు ఉన్నాయని తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయులు ల్యాబ్‌లను సక్రమంగా నిర్వహించి ప్రయోగాలు, పరిశీలనలు, ఫలితాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.ల్యాబ్‌ల్లో జాగ్రత్త చర్యలను చూపించే చార్ట్‌ను వేలాడదీయాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతుడు మణికుమార్

వల్లూరు : మండల పరిధిలోని పెద్ద లేబాక అరుంధతీవాడకు చెందిన చిన్న గురివిగాండ్ల మణికుమార్ (24) అనే యువకుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతడు శనివారం తెల్లవారుజామున గుండెల్లో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో వారు అతన్ని చికిత్స కోసం కమలాపురం క్రాస్ రోడ్డులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించే క్రమంలో నోటి నుంచి నురగ వస్తూ పరిస్థితి విషమించింది. దీంతో మెరుగైన వైద్యం కోసం కమలాపురం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

లారీ, జేసీబీ సీజ్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని రామాంజనేయపురం గ్రామ సమీపంలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుండగా లారీ, జేసీబీలను సీజ్ చేసినట్లు ఎర్రగుంట్ల పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపారు. రామాంజనేయపురం గ్రామంలోని పెన్నానదిలో జేసీబీని ఉంచి అక్కడి నుంచి లారీలలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా దాడి చేశామన్నారు. ఈ దాడిలో అక్కడ ఉన్న జేసీబీ, లారీతో పాటు ఐదుగురిని అరెస్టు చేసి వారిపై కేసును నమోదు చేశామన్నారు.

విద్యుత్ సిబ్బందిపై ఎస్‌ఐ దాడి


ఎస్‌ఐ దాడిలో గాయపడిన జేఎల్‌ఎం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని పూలఅంగళ్ల సర్కిల్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో విద్యుత్ జేఎల్‌ఎంలుగా పనిచేస్తున్న గురురాజ్, మహమ్మద్ షఫీలపై ఎస్‌ఐ అనిల్ దాడి చేశాడు. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అర్ధరాత్రి సమయంలో జయమ్మకాలనీ, ఆటోనగర్ కాలనీలలో విద్యుత్ ఫ్యూజులు వేసి వస్తుండగా పూలఅంగళ్ల వద్ద ఎస్‌ఐ అనిల్ వాహనాన్ని ఆపి ఈ సమయంలో ఎక్కడి నుంచి వస్తున్నారు అంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడి చేశారు. ఈ సంఘటనపై తోటి ఉద్యోగులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఎస్‌ఐ అనిల్‌ను వీఆర్‌కు పంపినట్లు సమాచారం.

బీఎస్‌ఎన్‌ఎల్ సేవ.. మరింత చేరువ

4జీ నెట్‌వర్క్‌తో ప్రజలకు చేరువవుతున్న భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్



కడపలోని బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారుల సేవా కేంద్రం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్‌ఎన్‌ఎల్) సరికొత్త టెక్నాలజీతో వినియోగదారులకు చేరువ అవుతోంది. టెలికాం రంగంలో ఎన్నో ప్రైవేట్ సంస్థలు వచ్చినా.. బీఎస్‌ఎన్‌ఎల్‌ను మాత్రం వినియోగదారులు సొంత సంస్థగా భావిస్తుంటారు. ప్రైవేట్ టెలికాం సంస్థలు మారుమూల గ్రామాలకు సేవలను విస్తరించలేకపోతున్నాయి. అదే తరుణంలో బీఎస్‌ఎన్‌ఎల్ ప్రతి ప్రాంతానికి చేరువ అవడంతో సంస్థ మనుగడ సాగిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సంస్థ సైతం సాంకేతిక టెక్నాలజీ వైపు ముందడుగు వేసి 4జీ బీఎస్‌ఎన్‌ఎల్ నెట్ వర్క్‌ను ప్రజలకు త్వరలో అందించనుంది. దీంతో పాటు మై బీఎస్‌ఎన్‌ఎల్ యాప్ ద్వారా వినియోగారులకు కావాల్సిన సేవలను అందిస్తోంది.

త్వరలో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ నెట్‌వర్క్ సేవలు..



జిల్లాలో బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు 4జీ సేవలను అందించేందుకు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ నెట్‌వర్క్ టవర్లను ఏర్పాటు చేసి ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంచారు. బీఎస్‌ఎన్‌ఎల్ సిమ్ కార్డుల కోసం, ఇతర కంపెనీల సిమ్‌ల నుంచి పోర్ట్‌కు మారేందుకు ప్రజలు బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయానికి అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు.

మై బీఎస్‌ఎన్‌ఎల్ యాప్‌తో విశిష్ట సేవలు..

ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్ మై బీఎస్‌ఎన్‌ఎల్ యాప్‌తో ప్రజలకు విశిష్ట సేవలను అందిస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సైతం విస్తృత ప్రచారాలు నిర్వహించారు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

గూగుల్ ప్లే స్టోర్‌లో మై బీఎస్‌ఎన్‌ఎల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తర్వాత ఈ-మెయిల్ ఐడీ లేదా రిజిస్టర్ మొబైల్ నంబర్‌తో యూజర్ నేమ్, పాస్ వర్డ్‌ను క్రియేట్ చేసుకోవాలి. అనంతరం మన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ఎంటర్ చేస్తే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది.

యాప్ ద్వారా పొందే సేవలు..

బిల్ పేమెంట్ : ఒకప్పుడు బీఎస్‌ఎన్‌ఎల్ బిల్లులు చెల్లించాలంటే క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి. ఇప్పుడు బీఎస్‌ఎన్‌ఎల్‌కు చెందిన ల్యాండ్ ఫోన్, మొబైల్ పోస్ట్ పెయిడ్, ఇంటర్నెట్ బిల్లులను యాప్ ద్వారా నిమిషాల్లో చెల్లించవచ్చు.

రీచార్జ్ : బీఎస్‌ఎన్‌ఎల్ ప్రీపెయిడ్ మొబైల్‌కు యాప్ ద్వారా రీచార్జ్ చేసుకోవచ్చు.

ఫ్యాన్సీ నంబర్ల ఎంపిక : మై బీఎస్‌ఎన్‌ఎల్ యాప్ ద్వారా దేశం మొత్తం మీద అందుబాటులో ఉన్న ఫ్యాన్సీ నంబర్లు, వాటి ధరలను తెలుసుకోవచ్చు. తద్వారా మనకు కావాల్సిన నంబరును మనం సొంతం చేసుకోవచ్చు. బీఎస్‌ఎన్‌ఎల్ ఫ్యాన్సీ నంబర్‌ను ఎంపిక చేసుకొని మన మొబైల్ నంబర్ ఇస్తే ఎస్‌ఎంఎస్ ద్వారా పిన్ నంబరు వస్తుంది. ఆ నంబరు మనకు 40 గంటల పాటు రిజర్వు చేసి ఉంచుతారు. ఆ లోగా బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయానికి వెళ్లి నంబరును సొంతం చేసుకోవచ్చు.

యూసేజ్ రిపోర్ట్..: యాప్‌లో మన ల్యాండ్ లైన్, బ్రాండ్ బ్యాండ్, మొబైల్ సీడీఎంఏకు చెందిన ప్రతి రోజు వినియోగాన్ని పొందవవచ్చు.

హిస్టరీ..: బీఎస్‌ఎన్‌ఎల్ ల్యాండ్ ఫోన్, మొబైల్ ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ బ్రాండ్ బ్యాండ్‌కు సంబంధించిన హిస్టరీని యాప్‌లోని హిస్టరీ ఆప్షన్ ద్వారా తెలుసుకోవచ్చు.

స్పెషల్ ఆఫర్లు..: బీఎస్‌ఎన్‌ఎల్‌కు చెందిన ప్రత్యేక ఆఫర్ల వివరాలను యాప్‌తో పొందవచ్చు.

ఫిర్యాదులు..

బీఎస్‌ఎన్‌ఎల్ సేవలకు సంబంధించి ఫిర్యాదులను వినియోగదారులు యాప్‌లోని కంప్లయింట్ అనే ఆప్షన్ ద్వారా ఉన్నతాధికారులకు తెలియజేయవచ్చు. తద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు.

- కొత్త ల్యాండ్ లైన్, ఇంటర్నెట్ కనెక్షన్ యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు.

ప్రైవేట్ టెలికమ్యూనికేషన్లకు దీటుగా సేవలు



ప్రైవేట్ టెలి కమ్యూనికేషన్లకు దీటుగా బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు అందిస్తోంది. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన 4జీ నెట్ వర్క్ సేవలను, మై బీఎస్‌ఎన్‌ఎల్ యాప్ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలి.
– పి. ముజీబ్ పాషా, జనరల్ మేనేజర్, బీఎస్‌ఎన్‌ఎల్, వైఎస్‌ఆర్ జిల్లా.

తుది దశకు చేరుకున్న అండర్-19 టోర్నీ

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ చివరి దశకు చేరుకుంది. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో శనివారం నిర్వహించిన మ్యాచ్‌లో కడప, విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 66.1 ఓవర్లలో 206 పరుగుల వద్ద కడప జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని ప్రణవ్‌కుమార్‌రెడ్డి 87 పరుగులు, ఆర్థిత్‌కుమార్‌రెడ్డి 37 పరుగులు చేశారు. విశాఖ బౌలర్లు యువన్ 4, రోహిత్ 2, రచిత్ 2 వికెట్లు చొప్పున తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన విశాఖ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 20 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 72 పరుగులు చేసింది. జట్టులోని ఈశ్వర్ రిత్విక్ 61 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, శ్రీకాకుళం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 70.3 ఓవర్లలో 289 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని లోహిత్ లక్ష్మినారాణ 67, చరణ్‌జీత్ 58 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు పూర్ణ 4, జున్నారావు 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 17 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 79 పరుగులు చేసింది. జట్టులోని సుశాంత్ 38 పరుగులు, థామస్ రామ్‌కుమార్ 36 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు.

కేఓఆర్‌ఎం మైదానంలో..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, కృష్ణా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 43.3 ఓవర్లలో 109 పరుగులకే నెల్లూరు జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని రోహిత్ 27 పరుగులు, హమీద్ 20 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్లు రాజేష్ 4, సాయిప్రకాష్ 2, గీత్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 44 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. జట్టులోని టి. వరుణ్ సాత్విక్ 108 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లతో 106 పరుగులు చేశాడు. ఈయనకు జతగా రాజేష్ 81 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. నెల్లూరు బౌలర్ హమీద్ 2 వికెట్లు తీశాడు. కాగా తొలిరోజు ఆట ముగిసే సమయానికి కృష్ణా జట్టుకు 112 పరుగుల ఆధిక్యం లభించింది.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : గంజాయి, నాటుసారా, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలు, అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశించారు. శనివారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్‌ఈబీ అధికారులతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో నాటుసారా అక్రమ తయారీ, అక్రమ రవాణా తగ్గుముఖం పట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేసి అక్రమ మద్యం, నాటుసారా వంటి చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. క్షేత్రస్థాయిలో ముందస్తు సమాచార వ్యవస్థను మెరుగుపరుచుకొని నిరంతరం దాడులు చేస్తూ గంజాయి వంటి మత్తుపదార్థాల ఆనవాళ్లు లేకుండా సమూలంగా అరికట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఎస్పీ తెలిపారు. ఇతర రాష్ట్రాల అక్రమ లిక్కర్, నాటుసారా, ఇసుక సంబంధిత కేసులు, గ్యాంబ్లింగ్ (పేకాట) వంటి అసాంఘిక కార్యకలాపాలు తదితర అంశాలపై జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అధికారులతో ఎస్పీ సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లాలో పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలను సమీక్షిస్తూ ఆయా కేసుల దర్యాప్తులో పురోగతి, ముద్దాయిల అరెస్టులపై ఆరాతీసి వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మాదక ద్రవ్యాలతో కలిగే దుష్ప్రభావాలపై కళాశాలలో విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్ కమల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు నాయుడు, జిల్లాలోని పోలీసులు పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం పునరుద్ధరించాలి



జూనియర్ కళాశాల ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని పీఆర్‌ఎస్‌వైఎఫ్ నాయకుడు నాగేంద్రబాబు డిమాండ్‌చేశారు. ఈమేరకు శనివారం జూనియర్ కళాశాల ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసిందన్నారు. కొంతకాలం తర్వాత పథకాన్ని పాలకులు రద్దు చేశారన్నారు. పథకం రద్దుతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం వెంటనే ఈ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంఘం రాయచోటి నాయకులు మాలిక్‌బాషా, మనోజ్, విష్ణు, రాజ, మహేష్‌లతో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐ సాదిక్ అలీకి జిల్లా ఎస్పీ అభినందనలు


సీఐ సాదిక్ అలీకి మెడల్ ప్రదానం చేస్తున్న ఎస్పీ

రాయచోటి టౌన్ : ఇండియన్ పోలీసు మెడల్ అందుకున్న రెడ్‌శాండిల్ టాస్క్‌ఫోర్స్ సీఐ సాదిక్ అలీని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అభినందించారు. ఇలాంటి మరెన్నో ఉన్నతమైన పతకాలు అందుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. శనివారం రాత్రి ఎస్పీ తన కార్యాలయంలో సాదిక్ అలీకి ఈ ప్రతిష్టాత్మకమైన మెడల్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సాదిక్ అలీ ఎంతో సాహసంతో కూడిన విధి నిర్వహణతో ఈ అవార్డును సాధించాడని చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎస్‌ఐగా, సీఐగా ఎన్నో సంచలనాత్మకమైన కేసులను ఛేదించాడన్నారు. ఇప్పటి వరకు 150కి పైగా అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్న పోలీస్ అధికారిగా రికార్డులు సాధించాడని భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సాధించాలనే ఆశాభావం వ్యక్తం చేశారు.

హస్తవరంలో వైద్యాధికారుల పర్యటన


హస్తవరంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరంలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి

రాజంపేట రూరల్ : జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.కొండయ్య, డీఎంఅండ్‌హెచ్ డాక్టర్ చిన్నికృష్ణ, డీఎంఓ వేణుగోపాల్ శనివారం హస్తవరం గ్రామాన్ని సందర్శించారు. మండల పరిధిలోని హస్తవరం గ్రామంలో శుక్రవారం డెంగీ వ్యాధితో రత్నమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. గ్రామంలో ఆకేపాడు పీహెచ్‌సీ ఎంఓ డాక్టర్ ఎస్. అశ్వినీచంద్ర ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. జిల్లా స్థాయి వైద్యాధికారులు రత్నమ్మ నివాస గృహాన్ని పరిశీలించారు. బంధువులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

రెండంతస్తుల భవనంపై పిడుగు

– తప్పిన పెను ప్రమాదం


పిడుగుపాటుకు పాక్షికంగా దెబ్బతిన్న భవనంపై గోడ

రాజంపేట రూరల్ : ఉరుములు మెరుపులతో శనివారం మధ్యాహ్నం స్వల్ప వర్షం కురిసింది. మండల పరిధిలోని కె.బోయినపల్లిలోని బొడిశెర్ల సుబ్బరాయుడు రెండంతస్తుల భవనంపై ఇదే సమయంలో పిడుగు పడింది. పిడుగు ఒక వైపు గోడపై పడటంతో పెను ప్రమాదం తప్పిపోయింది. అక్కడి నుంచి పక్కన ఉన్న బోగా బాలకృష్ణ సిమెంటు రేకుల ఇంటిపై పడింది. సుబ్బరాయుడు గోడ పాక్షికంగా దెబ్బతినగా బాలకృష్ణ సిమెంట్ రేకులు పగిలిపోయాయి. ఇరువురి గృహాలలో ఎలక్ట్రిక్ సామగ్రి దెబ్బతినింది.

ప్రభుత్వం ఆదుకోవాలి : పిడుగుపాటుకు పాక్షికంగా దెబ్బతిన్న గృహ యజమానులు బోడిశెర్ల సుబ్బరాయుడు, బోగా బాలకృష్ణలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి కోరారు. పిడుగు పడిన గృహాలను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకునేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గోదాము యజమాని రూ.4.2 కోట్లకు ఐపీ


శ్రీగణేష్ గోదాము వద్ద రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

జమ్మలమడుగు/పెద్దముడియం : పెద్దముడియం మండలం పెద్దపసుపల గ్రామంలోని శ్రీ గణేష్ ఫార్మర్ వేర్ హౌస్ యజమానుల్లో ఒకరైన రామస్వామి అలియాస్ చంటి రూ.4.2 కోట్లకు ఐపీ దాఖలు చేశాడు. శుక్రవారం చాలా మంది రుణ దాతలకు నోటీసులు అందాయి. దీంతో శనివారం రైతులు శ్రీగణేష్ ఫార్మర్ వేర్‌హౌస్ వద్దకు వచ్చి తమ సరుకులు ఉన్నాయో లేదో అంటూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. గతంలో తాడిపత్రి రహదారిలో ఉన్న ఓ గోదాము యజమాని ఐపీ పెట్టి గోదాముల్లో ఉన్న సరుకును చాలా వరకు రాత్రికి రాత్రే మాయం చేశారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంటుందేమోనని ఆందోళనలో రైతులు ఉన్నారు. గోదాములో ఉన్న సరుకులను ఎవ్వరూ తరలించుకుపోకుండా గోదాముకు సెక్యూరిటీ కల్పించాలని సీఐ గోపాలరెడ్డి, ఎస్‌ఐ సుబ్బారావును కోరారు.

భాగస్వాములతో చర్చించిన పోలీసులు

గణేష్ ఫార్మర్ వేర్‌హౌస్‌కు నలుగురు యజమానులు. అయితే గోదాము వ్యవహారాలను చూసే బాధ్యతలు రామస్వామికి అప్పగించారు. దీంతో పోలీసులు మిగిలిన భాగస్వాములతో చర్చించారు. రైతులకు సంబంధించిన ఒక్క బస్తా కూడా బయటికి వెళ్లనివ్వం, రైతులు తమ సరుకులు కావాలని వస్తే వారికి ఆదివారం రోజున వారి సరుకులను వారికి ఇచ్చేస్తాం అని భాగస్వామి క్రిష్ణమూర్తి వివరించారు.

రైతులకు అన్యాయం జరగనివ్వం

గోదాములో రైతులు దాచిన ధాన్యాన్ని వారికి కచ్చితంగా అందే విధంగా చూస్తాం. రైతులకు ఎలాంటి అన్యాయం జరగనివ్వం. ఇప్పటికే ఐపీ దాఖలు చేసిన రామస్వామి స్థానికంగా లేకపోవడంతో మిగతా ముగ్గురు భాగస్వాములను పిలిపించి మాట్లాడాము. ప్రస్తుతం ఉన్న సరుకును రైతులకు ఎత్తించి రైతుల ఫొటో తీసుకుంటాం. ఒక్క బస్తా కూడా తక్కువ లేకుండా రైతులకు న్యాయం చేస్తాం.
– సుబ్బారావు, ఎస్‌ఐ,పెద్దముడియం.

గంజాయి కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

మూడు కిలోల గంజాయి స్వాధీనం


గంజాయి కేసులో అరెస్టయిన వారి వివరాలను తెలియజేస్తున్న కడప చిన్నచౌక్ ఇన్‌చార్జి సీఐ

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పర్యవేక్షణలో డిస్ట్రిక్ట్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ (డి.ఎన్.సి.సి) ఆధ్వర్యంలో గంజాయి విక్రయాలపై దాడులు నిర్వహిస్తున్నారు. కడప నగరంలో శనివారం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కడప ఇన్‌చార్జి డీఎస్పీ ఎన్.సుధాకర్ పర్యవేక్షణలో డిస్ట్రిక్ట్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్, చిన్నచౌక్ ఇన్‌చార్జి సీఐ వి. సీతారామిరెడ్డి, ఎస్.ఐ ఎన్. రాజరాజేశ్వరరెడ్డి గంజాయి విక్రయదారులను ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరిని చలమారెడ్డిపల్లె క్రాస్ రోడ్‌లో అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మూడు కిలోల గంజాయి, సెల్‌ఫోన్, రూ. 6500 నగదును స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి నుంచి కొనుగోలు చేసి తీసుకుని వచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

అదృశ్యమైన మహిళ ఆచూకీ లభ్యం


నౌషాద్

రామసముద్రం : రామసముద్రంలో అదృశ్యమైన మహిళ ఆచూకీ లభ్యమైంది. ఊలపాడు గ్రామానికి చెందిన బి.నౌషాద్, ఆమె కుమార్తై షాఫియాను తీసుకుని గురువారం ఊరికి వెళ్తున్నానని బయలుదేరారు. అనంతరం భర్త ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువుల ఊర్లలో, చుట్టు పక్కల ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నౌషాద్‌ను పుత్తూరు వద్ద గుర్తించి తీసుకొచ్చారు. ఆమెకు ఎస్‌ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం రాయచోటి మహిళా హోమ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శాస్త్రోక్తంగా ఒంటిమిట్ట రామయ్యకు స్నపన తిరుమంజనం


తులసి గజమాలలతో దర్శనమిస్తున్న మూలమూర్తులు

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో శనివారం మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు తీసుకొచ్చిన పట్టు వస్త్రాలు, పూలమాలలతో ఆలయ ప్రదక్షిణ గావించి, గర్భాలయంలోని మూలవిరాట్‌కు సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు గర్భాలయంలోని మూలమూర్తులకు పంచామృతాభిషేకాలు చేసి పట్టు వస్త్రాలు సమర్పించి, తులసి గజమాలలతో సుందరంగా అలంకరించారు. అలంకరణ అనంతరం ఆలయ అర్చకులు మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

గొడవ చేయొద్దంటే దాడి చేశాడు

మదనపల్లె : మద్యం తాగి గొడవ చేయొద్దని వారించిన ఇంటి యజమానిపై అద్దెకుంటున్న వ్యక్తి దాడి చేసిన సంఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని బెంగళూరు రోడ్డు పెట్రోల్ బంక్ సమీపంలో నివసిస్తున్న రెహమాన్ కుమారుడు సయ్యద్ జావీద్ అహ్మద్ (38), తన ఇంటి పక్కనున్న గదిని ఫరూక్ అనే వ్యక్తికి అద్దెకిచ్చాడు. అయితే ఫరూక్ తరచూ మద్యం సేవించి ఇంట్లో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం మద్యం మత్తులో ఇంటి వద్ద గొడవ చేస్తుండగా, సయ్యద్ జావిద్ అహ్మద్ అతడిని గొడవ చేయొద్దంటూ వారించాడు. దీంతో ఆవేశానికి లోనైన ఫరూక్ రాడ్డుతో సయ్యద్ జావిద్ అహ్మద్‌పై దాడి చేశాడు. దాడిలో తలకు గాయం కావడంతో బాధితుడు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అనంతరం దాడి ఘటనపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు


గాయపడిన లక్ష్మీనారాయణ

కలకడ : కారు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర రక్త గాయాలైన సంఘటన శనివారం చిత్తూరు-కర్నూలు జాతీయరహదారిపై కలకడ జామియా మసీదు సమీపంలో జరిగింది. శనివారం ఉదయం 11 గంటల సమయంలో సంబేపల్లె మండలం, ఎస్.సోమవరం పంచాయతీ ఎగువనల్ల గుట్టపల్లె గ్రామానికి చెందిన సిద్దయ్య కుమారుడు లక్ష్మీనారాయణ తన ద్విచక్రవాహనంలో కలకడనుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ సమయంలో పీలేరు నుంచి రాయచోటి వైపు వెళుతున్న ఏపీ03 బీ2-6279 కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన లక్ష్మీనారాయణను కలకడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు


విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఇంటిని తనిఖీ చేస్తున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

రాయచోటి (జగదాంబసెంటర్) : విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని.. విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ విజిలెన్స్ డీఈ రమేష్ అన్నారు. శనివారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలో విద్యుత్ శాఖ డీపీఈ ఎస్‌ఈ శ్రీనివాసబాబు ఆదేశాల మేరకు విద్యుత్ చౌర్యానికి పాల్పడిన పలు ఇళ్లపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమ విద్యుత్ వాడుతున్న 18 మందిని గుర్తించి వారికి రూ.2 లక్షల జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ విజిలెన్స్ ఏడీఈలు మధులత, ప్రవీణ్ కుమార్, ఏఈలు నాగరాజు, రామాంజనేయరెడ్డి, రవి, నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

కడప అర్బన్ : కడప అటవీశాఖ పరిధిలోని లంకమల్ల రిజర్వ్ ఫారెస్ట్ ఖాజీపేట సెక్షన్ బయనపల్లి బీట్, కొండపేట కేసీ కెనాల్ ప్రదేశం వద్ద ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న నలుగురు నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు కడప స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రభాకర్ తెలిపారు. వారి వద్ద నుంచి 10 ఎర్రచందనం దుంగలను, అక్రమ రవాణా చేస్తున్న ఏపీ02 ఏబీ2233 గల చవర్లేట్ కారు, పైలట్‌గా వస్తున్న రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.